ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జయశంకర్ భూపాలపల్లి
గురువారం 10 ఏప్రిల్ 2025

ఏజెన్సీ వైద్యశాలలకు మహర్దశ




- ఏటూరునాగారం ఆస్పత్రి అప్‌గ్రేడ్
- 50 పడకల ఏరియా హాస్పిటల్‌గా మార్పు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సివిల్ పనులకు రూ. 22 కోట్లు మంజూరు

6

మందులోడు.. మాయలోడు..!

బినామీలతో వైద్యశాఖనే శాసిస్తున్న మెడికల్ డాన్



అతను వైద్యశాఖలో డ్రైవర్‌గా చేరాడు. క్రమక్రమంగా అంతర్గత ప్రమోషన్లతో హెల్త్ అసిస్టెంట్ స్థాయికి ఎదిగాడు. కానీ ఇప్పుడాయన తాను పని చేసే వైద్యశాఖనే శాసిస్తూ 'మెడికల్ డాన్'గా మారాడు. ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దె వాహనాలు మొదలు.. ఆస్పత్రుల్లో శానిటేషన్, ఫుడ్ క్యాటరింగ్ కాంట్రాక్టుల్లో సింహభాగం అతడి బినామీలవేనంటే అతిశయోక్తి కాదు. ఇక ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల భర్తీలో అయితే ఆయన చెప్పిందే వేదమట. ఈ దందా అంతా తన విశాలమైన ఫామ్‌హౌస్ నుంచే నడిపిస్తున్నాడట. అధికారులకు విందులు, వినోదాలు ఏర్పాటు చేసి.. వారిని ఖుషీ చేసి.. తన పనులు చక్క పెట్టుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం అధికారులకు మగువలను ఎరవేయడం.. ఆ తర్వాత బ్లాక్‌మెయిల్ కూడా చేస్తారన్న పేరుంది. దాంతో అటెండర్ల నుంచి ఐఏఎస్‌ల వరకు ఆయనకు జీ హుజూర్ అంటుంటారట. అలా తన సెటిల్ మెంట్లకు ఎంతటివారైనా తలొగ్గేలా చేసుకున్న ఆ వ్యక్తి ఓ డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరి.. అసిస్టెంట్ స్థాయికి ఎదిగి.. జనగామ జిల్లా కేంద్రంగా దందా సాగిస్తూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వైద్యశాఖనే శాసిస్తూ రూ.కోట్లు గడించిన వైనం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

- జనగామ కేంద్రంగా దందా సాగిస్తున్న వైనం
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలన్నీ ఆ ఉద్యోగి కనుసన్నల్లోనే..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అద్దె వాహనాల దందా
- శానిటేషన్ నుంచి ఫుడ్ కేటరింగ్ వరకు కాంట్రాక్టులన్నీ అతడి మనుషులకే..
- తన ఫామ్‌హౌస్‌లో అధికారులకు విందులు, వినోదాలు.. అక్కడే సెటిల్‌మెంట్లు..
- అటెండర్ల నుంచి ఐఏఎస్‌ల వరకు అందరితోనూ సత్సంబంధాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

తాను పని చేస్తున్న వైద్యశాఖను శాస్తున్నాడు ఓ ఉద్యోగి. పాతికేళ్ల క్రితం ఉమ్మడి వరంగల్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో డ్రైవర్‌గా చేరిన ఆయన.. ఆ తరువాత క్రమక్రమంగా అంతర్గత ప్రమోషన్లతో సూపర్‌వైజర్ స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం జనగామ జిల్లాలో పని చేస్తున్న సదరు ఉద్యోగి మొత్తం వైద్య వ్యవస్థనే తన చేతుల్లోకి తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీలు, జనరల్ ఆస్పత్రులతో పాటు చివరికి మెడికల్ కాలేజీల్లో కూడా తన పెత్తనమే నడిచేలా చక్రం తిప్పుతున్నారట. ఇక అటెండర్ నుంచి ఐఏఎస్‌ల వరకు సదరు ఉద్యోగికి సలాం కొట్టాల్సిందేనని, అధికారులకు కళ్లెం వేసేందుకు జనగామ జిల్లాలో ఓ గ్రామంలో స్విమ్మింగ్ పూల్ తదితర అధునాతన సౌకర్యాలతో నిర్మించిన తన ఫామ్‌హౌస్‌లో విందులు, వినోదాలు ఏర్పాటు చేస్తారనే చర్చ జరుగుతోంది. అంతేకాదు.. మగువలను ఎరగా వేసి.. ఆపై రహస్యంగా వీడియోల్లో బంధించి.. నయానో భయానో పై అధికారులను బుట్టలో వేసుకుంటారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిత్యం పైరవీలు, కాంట్రాక్టు పనులే తప్ప ఎప్పుడు సక్రమంగా ఉద్యోగానికి వెళ్లరని ఆ శాఖ ఉద్యోగులే చెబుతుండటం గమనార్హం. రూ.వేలకు వేలు జీతం తీసుకుంటూ.. ప్రభుత్వ ఉద్యోగం చేయకుండా కాంట్రాక్టు పనులు, ఉద్యోగాలు ఇప్పించే మధ్యవర్తి పనులు చేస్తున్న సదరు ఉద్యోగితీరు వైద్యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

అన్నిట్లో ఆ ఉద్యోగిదే దందా..

ఉమ్మడి వరంగల్ జిల్లా వైద్యశాఖలో ప్రస్తుతం ఈ ఉద్యోగి వ్యవహార శైలిపై జోరుగా చర్చ జరుగుతోంది. ఒక సాధారణ ఉద్యోగికి 50కి పైగా ట్రావెల్ బస్సులు, కార్లు, అంబులెన్స్ వాహనాలతో పాటు సిటి స్కానింగ్ కేంద్రాలు, జనగామ, హనమకొండలో ఐదారు అంతస్థుల భవనాలు ఎలా వచ్చాయనేది హాట్‌టాపిక్‌గా మారింది. బతకటమే కష్టంగా ఉన్న పరిస్థితుల నుంచి బినామీ పేర్లతో రూ.కోట్ల ఆస్తులను కూడ బెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, బినామీ పేర్లతో కాంట్రాక్టులు, అద్దె వాహనాలతో భారీగా సొమ్ములు పోగు చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్యశాఖతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో తిరిగే అద్దె కార్లలో 40కి పైగా ఈ ఉద్యోగి, అతని బినామీలకు సంబంధించినవేనట. ఈ కార్ల వ్యవహారంలోనూ భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రతీ నెల 2,500కిలో మీటర్లు వాహనం నడపాల్సి ఉంటుంది. కానీ,

మిగతా 5వ పేజీలో...



సదరు మెడికల్ డాన్‌పై ఓ వ్యక్తి డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదు కాపీ..



కడవెండిలో రేణుక విప్లవ సాహితీ కృషి పుస్తకం ఆవిష్కరిస్తున్న వక్తలు, కుటుంబ సభ్యులు

అక్షరాల్లో రేణుక సజీవంగా ఉంటుంది

- తన రచనలతో 20ఏళ్లుగా చైతన్యం నింపారు
- ఆమెది బూటకపు ఎన్‌కౌంటర్
- కార్పొరేట్ శక్తులకు ఖనిజ సందప దోచిపెట్టేందుకే 'కగార్'
- రేణుక సంస్మరణ సభలో విమలక్క, తదితర వక్తలు

4



సంస్మరణ సభలో మాట్లాడుతున్న విమలక్క



పత్తి కొనుగోళ్లలో సీసీఐ రికార్డు

- 2024-25లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36,47,618 క్వింటాళ్లు కొనుగోలు
- రాష్ట్రంలో అత్యధికంగా ఇక్కడి నుంచే పత్తి అమ్మకాలు
- 2024కంటే 14.36లక్షల క్వింటాళ్ల అదనంగా కొన్న కాటన్ కార్పొరేషన్
- మద్దతు ధరలు అంతంతే ఉన్నా.. భారీగానే విక్రయించిన రైతులు
- దొంగ టీఆర్‌లతో ప్రైవేట్ వ్యాపారులు విక్రయించిన పత్తి లెక్కలు తేలని వైనం
- 'విజిలెన్స్' నివేదికతోనే వాస్తవాలు వెలుగులోకి!

5

నిరుద్యోగ సమస్య నిర్మూలనే లక్ష్యం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి సంబంధిత అధికారులు, మెగా జాబ్‌మేళా నిర్వహించే టాస్క్ కంపెనీ ప్రతినిధులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. జిల్లా కేంద్రంలోనిపవ్వగ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 26న నిర్వహించే మెగా జాబ్‌మేళాపై సమీక్షిం చారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో టాస్క్ కంపెనీ నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో 700 కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జాబ్‌మేళా ద్వారా 10 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు క్యూఆర్ కోడ్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విద్యార్హతల ప్రకారం ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కేటీపీఎస్ సీఈ శ్రీప్రకాశ్, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రైతులతో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఈసీఐఎల్ కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి కొనుగోలు చేసిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు 20 స్కూటీలు, రైతులకు 12 డ్రోన్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్‌లో బుధవారం జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మారుమూల ప్రాంతాల్లో సేవలు అందించేందుకు స్కూటీలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వ్యవసాయంలో డ్రోన్లు, వైద్య సేవల కోసం సిటి స్కాన్ వంటి పరికరాలను అందజేస్తున్న ఈసీఐఎల్ సంస్థ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. రసాయనిక పురుగు మందుల వినియోగానికి డ్రోన్లు రైతులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఈసీఐఎల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సీపీఐ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు డ్రోన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఈసీఐఎల్ సంస్థ ఎండి అనురాగ్ కుమార్

తమ్ముడి చేతిలో అన్న హతం

- మద్యం మత్తులో దారుణం
- వాజేడు మండలంలో ఘటన



హత్యకు గురైన వాసం విజయబాబు



వాసం విజయబాబు (ఫైల్)

వాజేడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో సొంత అన్నను తమ్ముడు హత్య చేసిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తటేకులగుడెం గ్రామానికి చెందిన వాసం విజయబాబు(30) మంగళవారం కూలి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో అతడి తమ్ముడు ఆకాష్ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. విజయబాబుతో కూడా ఘర్షణకు దిగాడు. మద్యం తాగడానికి డబ్బులు అడగ్గా అతడు నిరాకరించాడు. ఈ క్రమంలో మాటామాట పెరిగి పదునైన గునపం లాంటి రాడ్డుతో అన్న విజయ కుమార్‌పై ఆకాశ్ దాడి చేశాడు. మూడు చోట్ల పోట్లు పొడవడంతో విజయబాబు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది విజయబాబును పరీక్షించి అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. వాసం అచ్చయ్య, లక్ష్మి దంపతులకు ముగ్గురు కొడుకులు. పెద్ద కుమారుడు విజయ కుమార్ తాపీ మేస్త్రీ వద్ద కూలి పని చేస్తుండేవాడు. రెండో కుమారుడు ఆకాశ్ కూడా పలు కూలి పనులు చేస్తుంటాడు. విజయ కుమార్ అవివాహితుడు. ఇద్దరు తమ్ముళ్ల ఆకాశ్‌తోపాటు రాజేంద్రప్రసాద్‌కు వివాహం జరిగింది.

కుటుంబ సభ్యులతోపాటు అన్నతో తరచూ ఆకాశ్ గొడవపడే వాడు. ఈ క్రమంలోనే అన్న విజయ కుమార్‌ను క్షణికావేశంలో హత్య చేశాడు. సంఘటన స్థలాన్ని సీఐ బండారి కుమార్ బుధవారం ఉదయం పరిశీలించారు. మృతుడి చిన్న తమ్ముడు రాజేంద్ర ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

భర్త, అత్తింటివారి వేధింపులే కారణమని మృతురాలి తల్లి ఫిర్యాదు



చిన్న కూతురుతో రజిత(ఫైల్)

కాటారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మద్దులపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. భర్తతోపాటు అత్తింటి వారి వేధింపుల వల్లే తన కూతురు బలవన్మరణానికి పాల్పడిందని మృతురాలి తల్లి ఆరోపిస్తోంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... మహాముత్తారం మండలంల మహబూబ్‌పల్లికి చెందిన ఎర్నేని లక్ష్మి, మారయ్య దంపతుల కూతురు రజిత (25)తో కాటారం మండలం మద్దులపల్లికి చెందిన పిట్టల శంకర్‌కు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. తన కుటుంబ సభ్యులకు ఇష్టం లేకున్నా రజితను శంకర్ పెళ్లి చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు. ఆరేళ్ల కుమారుడు శివకుమార్, నాలుగేళ్ల కూతురు అవంతిక, రెండేళ్ల కూతురు సుహాన ఉన్నారు. మద్యానికి బానిసైన శంకర్ భార్య రజితతో తరచూ గొడవపడే వాడు. ఆమెను శారీరక, మానసిక వేధించేవాడు. తన తల్లి లింగమ్మ, అన్న కిష్టస్వామి, అక్క కాల్నేని లక్ష్మిల చెప్పుడు మాటలు విని మరింతగా వేధిస్తుండేవాడు. రజిత ఎవరితో మాట్లాడినా భర్త శంకర్‌తోపాటు అతడి కుటుంబసభ్యులు అక్రమ సంబంధం అంటగట్టేవాడు. ఇటీవల రజిత తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండగా కూతురిని చూడాలని ఉందని చెప్పడంతో ఆమె సోదరుడు రఘుపతి మద్దులపల్లికి వచ్చాడు.

ఆ సమయంలో శంకర్ తన భార్యను పంపించకుండా బామ్మర్దితో గొడవపడ్డాడు. మంగళవారం రాత్రి సైతం రజితతో ఘర్షణకు దిగాడు. దీంతో జీవితంపై విరక్తిచెందిన రజిత బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కొద్ది సేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించేసరికి అప్పటికే మృతి చెందింది. భర్త శంకర్‌తో పాటు మిగతా ముగ్గురు కుటుంబసభ్యుల వేధింపుల వల్లే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి ఎర్నేని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మల్హూర్ నాయక్

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ మల్హూర్ నాయక్ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందికి ఆన్‌లైన్ ఎల్సీ (లైన్ క్లియర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్సీలు తీసుకుని పనిచేసే సమయంలో అనేక సందర్భాల్లో మానవ తప్పిదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ క్రమంలో ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్ ఎంచుకోవడం, పంపిణీ వ్యవస్థకు సరిగ్గా గుర్తుచేసుకోకపోవడం, సమాచా ర లోపం తదితర కారణాల వల్ల విద్యుత్ ఉద్యోగులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే ఎల్సీ యాప్‌ను విద్యుత్ శాఖ అందుబాటులోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా ఎలాంటి ప్రమాదాలు జరగవని స్పష్టం చేశారు. ఏఈ అనుమతి లేకుండా తీసుకునే ఎల్సీలను నివారించొచ్చని తెలిపారు. సిబ్బంది పనిచేసే క్రమంలో తప్పనిసరిగా హెల్మెట్, హ్యాండ్ గ్లౌజెస్ వాడాలని సూచించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి డివిజన్ ఇంజనీర్లు పాపిరెడ్డి, వెంకటేశం, ఏడీఈ, ఏఈ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మల్హూర్‌నాయక్

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి

ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు

బయ్యారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అమ్మమ్మ దశదిన కార్యక్రమాలకు వెళ్తూ ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషాద ఘటన బుధవారం బయ్యారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. అయోధ్యాపురం వాయిల్‌బంధం గ్రామానికి చెందిన సొక్కం వెంకటయ్య-సావిత్రమ్మ చిన్న కుమారుడు నాగేశరరావు (43) భద్రాద్రి కొత్త గూడెం జిల్లా సారపక పేపర్‌మిల్ (ఐటీసీ)లో ఉద్యోగం చేస్తున్నాడు. వాయిల్ భందంలో ఉంటున్న తన అమ్మమ్మ ఆది సత్తెమ్మ దశదినకర్మ కార్యక్రమాలకు తన కుటుంబం (భార్య సునీత, కుమారుడు ప్రజ్వల్)తో కలిసి ద్విచక్రవాహనంపై సారపాక నుంచి ఇల్లెందు, మహబూబాబాద్ మీదిగా వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే బయ్యారం మండలం నామాలపాడు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా మహబూబాబాద్ నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న కుటుంబసభ్యులు నాగేశ్వరరావు, సునీత, ప్రజ్వల్‌కు గాయాలయ్యాయి. వెంటవే వీరిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు అపస్మారక స్థితిలోకి వెళ్లి పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా, కారుపల్టీ కొట్టడంతో కారు నడుపుతున్న ఖమ్మం జిల్లా కారెపల్లి మండలం ఉసిరికాయలపల్లికి చెందిన గుగుళ్ల రామనాథచారికి కూడా గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. మృతుడి మామ ఆది చినరామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పశువుల కంటైనర్ స్వాధీనం


పట్టుబడిన పశువుల కంటైనర్, నిందితులను చూపిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిపోతున్న పశువుల కంటైనర్‌ను ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్ద ఎస్సై తాజుద్దీన్ తనిఖీలు చేస్తుండగా 40 పశువులతో అక్రమంగా తరలి పోతు న్న కంటైనర్‌ను పట్టుబడింది. ఈ పశువులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి ఏటూరునాగారం, ములుగు మీదుగా హైద రాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్నట్లు తెలిందీ. పోలీసులు ఆ కంటైనర్‌ను, నిందితులను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంటైనర్‌లోని 40 పశువులను భూపాలపల్లి జిల్లాలోని రాంపూర్ గోశాలకు తరలించారు. పశువుల రవాణాకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

మహాముత్తారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి కేసులో ఓ యువకుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష పడింది. ప్రాసిక్యూషన్ ప్రకారం.. 2020లో భూపాల పల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని నిమ్మగూడెం గ్రామానికి చెందిన 22 ఏళ్ల గౌరవేని అర్జున్.. 15 ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేశాడు. దీంతో అప్పటి ఎస్సై రాజు కేసు నమోదు చేశారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఈ కేసు నడవగా అప్పట్లో కాటారం డీఎస్పీగా ఉన్న కిషన్ చార్జ్‌షీట్ దాఖలు చేసి, సాక్ష్యాదారాలను ప్రవేశపెట్టారు. స్పెషల్ ప్రాసి క్యూటర్ విష్ణువర్ధన్‌రావు వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో జిల్లా న్యాయమూర్తి పి. నారాయణ బాబు దోషికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ. 15 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్షపడేలా వ్యహరించిన కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై మహేందర్ కుమార్‌ను ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గార్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం యువతీ, యువకులకు అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వయం సంవృద్ధిని సాధించాలని మహబూబాబాద్ అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో మంగమ్మ, జీపీ కార్యదర్శి కిషన్‌నాయక్, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముఖం చూపితేనే హాజరు

- అదికూడా పనిచేసే చోట
- వైద్య ఆరోగ్యశాఖలో అమలులోకి రానున్న అబాస్ విధానం
- వైద్యాధికారి నుంచి అటెండర్ వరకు వివరాల సేకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ

తొర్రూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరయ్యే అధికారులు, సిబ్బందికి ఇక చెక్ పడనుంది. ఇష్టం వచ్చినపుడు వస్తాం. వచ్చిన పుడు రిజిస్టర్‌లో సంతకం పెడతాం.. అనే వారి పప్పులు ఇక ఉడకవ్. కచ్చితంగా పని చేసే చోటుకు వెళ్లి మొబైల్ ఫోన్‌లో అబాస్ (ఆధార్ బేస్‌డ్ అటెండెన్స్ సిస్టమ్) యాప్‌లో ముఖం చూపిస్తేనే హాజరు పడనుంది. తెలంగాణ ప్రజా రోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ఈవిధానం అమలులోకి తేనుంది. ఇందుకోసం జిల్లాలోని వైద్యాధికారి నుంచి అటెం డర్ వరకు ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. వివరాల నమోదు పూర్తైన తర్వాత ఆవిధానాన్ని అమలులోకి తేనున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, అర్బన్ హెల్త్ సెంటర్, సబ్‌సెంటర్‌లలో పనిచేసే వైద్యులు, ఇతర సిబ్బంది వివరాలను ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఆయా సిబ్బంది తాము పనిచేసే చోటకు వెళ్తేనే యాప్ ఓపెన్ అవుతుంది. అపుడు మొబైల్ ద్వారా ఫేస్ రికగ్నిజేషన్ జియో ఫెన్స్‌డ్ విధానంతో హాజరు నమోదవుతుంది. ఎక్కడో ఉండి అటెండెన్స్ వేస్తామంటే యాప్ తీసుకోదు. దీంతో రోజూ అటెండెన్స్ పడనుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 800 మంది సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం కొందరు సిబ్బంది పలు చోట్ల వంతుల వారీగా, మరికొన్ని చోట్ల వారానికి 1రోజు విధులకు హాజరై అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విధానం అములుతో అటువంటి వారి ఆటలు సాగవని పలువురు చర్చించుకుంటున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం..

జిల్లాలో ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే సిబ్బంది వివరాలు సేకరిస్తున్నాం. రెండు మూడు రోజుల్లో వివరాలు పూర్తి చేసి రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులకు పంపిస్తాం. జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 1 అర్బన్ హెల్త్ సెంటర్, 2 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు, 173 సబ్ సెంటర్‌లు, 1 ఏరియా ఆస్పత్రి ఉన్నాయి. వీటిల్లో సుమారు 800 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు అబాస్ ద్వారా అటెండెన్స్ అమలు చేయడం జరుగుతుంది.

\- కె.ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి



తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

త్వరలో ప్రారంభించేందుకు కసరత్తు

అబాస్ యాప్ ద్వారా మహబూబాబాద్ జిల్లాలో ప్రారంభించేందుకు వైద్య ఆరోగ్య శాఖ, రాష్ట్ర ఉన్నతాధి కారులు చర్యలు చేపట్టారు. పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఖమ్మం జిల్లాలో ప్రారంభించింది. అక్కడ ఆ విధానం అమలవుతోంది. డుమ్మాకొట్టే సిబ్బందికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. గతనెల 21న డీఎంహెచ్‌వోలకు ఆదేశాలు అందాయి. దీంతో జిల్లా వైద్యశాఖ అధికారులు సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. ఉద్యోగుల వివరాలను యూడీసీలు, జూనియర్ అసిస్టెంట్‌లు సేకరిస్తున్నారు. ఈ యాప్ ద్వారా అటెండెన్స్ అమలుచేయనున్నారు. ప్రభుత్వం ఈవిధంగా ఏర్పాట్లు చేస్తుండటంతో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. వైద్యశాఖ అంటే అత్యవసరంగా పనిచేసే సిబ్బంది అని వెసులుబాటు కావాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

రైతులను ఆదుకోవాలని రాస్తారోకో


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

గోవిందరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 7న రాష్ట్రంలో ఎక్కడాలేనివిధంగా వడగండ్ల వాన కురవడంతో లక్నవరం చెరువు కింద 6వేలకు ఎకరాలకుపైగా వరిపంట దెబ్బతిన్నదని, వందలాది ఎకరాల్లో మామిడితోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. పంటలు నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం అందించాలని, దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు రూ.5లక్షల చొప్పున అందించాలని, వ్యవసాయ అధికారులు పారదర్శకంగా పంటనష్టంపై సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ జవహర్‌రెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు భూక్య దేవానాయక్, లకావత్ నర్సింహనాయక్, గూడూరు శ్రీనివాసరావు, రావి నాగార్జున, తుంగపాటి మధు, సమ్మిరెడ్డి, మల్లారెడ్డి, సామ చిట్టిబాబు, గుండు రామస్వామి, తీగల ఆదిరెడ్డి, సురేష్, భూక్య మంగ్యానాయక్, మోహన్‌రెడ్డితో పాటు పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధం


దగ్ధమైన కంకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తేజావత్ రాంసింగ్‌తండా శివారు గన్నెచక్కృతండాలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు బాదావత్ నంద తెలిపిన వివరాల ప్రకారం. తనకున్న నాలుగు ఎకరాలలో మొక్కజొన్న పంటను సాగు చేసినట్లు చెప్పారు. పంట చివరి దశకు వచ్చిన సమయంలో కంకులు తెంపి ఒకచోట కుప్పగా పోశారు. ఒక్కసారిగా గాలిదుమారం రావడంతో పైన ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికి మరొకటి తగిలి నిప్పురవ్వలు కంకుల కుప్పపై పడడంతో నిప్పంటుకుని దగ్ధమైనట్లు చెప్పారు. దీంతో తనకు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని రైతులు వేడుకున్నా డు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ గన్నెచక్కతండా చేరుకుని ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత రైతును పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెం కటేశ్వర్లు, బోడ బోజీ, మంగీలాల్, పూల్‌సింగ్, ఈర్య పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే వెన్నెముక

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ విజయాల్లో కార్యకర్తలే వెన్నెముక లాంటి వారని, సంవత్సరాలుగా పార్టీ బలోపేతం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారి సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రారెడ్డి అన్నారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మోరె వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన బీజేపీ 45వ వ్యవస్థాపక దినోత్సవానికి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలోని ప్రజలందరూ బీజేపీ సుపరిపాలనను చూస్తున్నారన్నారు. ఇటీవల పార్టీ సాధించిన అనేక చారిత్రాత్మక విజయాల్లో ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. దేశ పురోగతికి వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సమాజ సర్వతోముఖాభివృద్ధి దిశగా ఎన్డీఏ ప్రభుత్వం సేవ చేస్తోందని తెలిపారు. దేశ ప్రజల రక్షణే లక్ష్యంగా, ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న నరేంద్రమోదీ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో కాషాయజెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఆరు గ్యారంటీలు, 420హామీలతో తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కుమ్మరి సాంబయ్య, జమలాపురం సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు పుల్యాల రాజు, మండల ప్రధాన కార్యదర్శులు బండారి శ్రీనివాస్, అరికాంతపు కృష్ణారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ పెల్లి మల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షులు బలుగూరి కిషన్‌రావు, రాస భిక్షపతి, నాయకులు అనుముల శ్రీనివాస్, పులి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో వెస్ట్ బెంగాల్ ఐజీ పూజలు

మహదేవపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమం కాళేశ్వరంలో పశ్చిమ బెంగాల్ ఐజీ సుధీర్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఐజీ మాతృమూర్తి ఇటీవల మృతిచెందగా ఆమె అస్థికలు త్రివేణి సంగమంలో కలిపేందుకు ఆయన కాళేశ్వరం వచ్చారు. గోదావరి తీర ప్రాంతంలో పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోటు ద్వారా త్రివేణి సంగమానికి చేరుకుని ఆమె అస్థికలు నదిలో కలిపారు. ఆయన వెంట కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి పలువురు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

తొర్రూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ప్రయాణీకురాలు తాను పోగొట్టుకున్న నగదు, పర్సును ఆర్టీసీ ఉద్యోగులు మానవత్వంతో తిరిగి అప్పగించిన సంఘటన తొర్రూరు డిపో బస్సులో చోటు చేసుకుంది. ఆర్టీసీ ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తొర్రూరు నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే బస్సులో ఓ ప్రయాణీకురాలు తన హ్యాండ్‌బ్యాగ్‌ను మర్చిపోయి బస్సు దిగింది. గమ్యస్థానానికి చేరడంతో హ్యాండ్ బ్యాగును గుర్తించిన కండక్టర్ పెండెం రమేష్, డ్రైవర్ బీ.ఎస్. కుమార్ పరిశీలించగా బ్యాగులో నగదు, సెల్‌ఫోన్, ఇతర వస్తువులు ఉన్నాయి. బ్యాగులో ఉన్న ఫోన్‌కు కాల్ రావడంతో వారికి సమాచారం అందించారు. వాటిని గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది జూబ్లీ బస్‌స్టేషన్‌లో బాధితురాలికి అందించారు.

అక్షరాల్లో రేణుక సజీవంగా ఉంటుంది

- తన రచనలతో 20ఏళ్లుగా చైతన్యం నింపారు
- ఆమెది బూటకపు ఎన్‌కౌంటర్
- కార్పొరేట్ శక్తులకు ఖనిజ సందప దోచిపెట్టేందుకే 'కగార్'
- రేణుక సంస్మరణ సభలో విమలక్క, తదితర వక్తలు


కడవెండిలో పాటపాడుతున్న విమలక్క

దేవరుప్పుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అక్షరాల రూపంలో రేణుక సజీవంగా ఉంటుందని, మెట్లమీద కథతో ప్రారంభమైన ఆమె కలం 17కథలు రాసిందని, ఆదివాసీల జీవన విధానం, స్థితిగతులు, ఎదుర్కొంటున్న సమస్యలపై 20ఏళ్లుగా అరణ్యాలు, ఆదివాసీలు, అడవి బిడ్డలను అంటి పెట్టుకుని కళ్లకు కటినట్టు సాహిత్య, విప్లవ రచనల రూపంలో చైతన్యం నింపారని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో మావోయిస్టు, దండకారణ్యం జోన్ కేంద్ర కమిటీ సభ్యురాలు గుముడవెల్లి రేణుక అలియాస్ చైతు అలియాస్ మిడ్కో అలియాస్ భాను పదో రోజు సందర్భంగా సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, పీడబ్ల్యూవో సంధ్య, ఏకే ప్రభాకర్ రచయిత, రచయిత్రీ అనురాధ, విరసం అధ్యక్షుడు అసరవెల్లి కృష్ణ, గాయని మాభూమి సంధ్య, ప్రజాకళామండలి ప్రతినిధి రాజనర్సింహ, రచయిత్రి జర్నలిస్ట్ తాయమ్మ కరుణ, పౌరహక్కుల సంఘం ప్రతినిధి లక్ష్మణ్, ఏపీటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎర్రంఎడ్డి నర్సింహరెడ్డి, అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి తదితరులు హాజరై రేణుక చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రేణుక అలియాస్ మిడ్కోవిప్లవ సాహితీ కృషిపై రచించిన 'అందరసోంటి సావు కాదు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఆదివాసీలను గెంటివేసి కార్పొరేట్ శక్తులకు ఖనిజ సంపదను దోచి పెట్టడం కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను ప్రవేశపెట్టాయని విమర్శించారు. రేణుకది బూటకపు ఎన్‌కౌంటర్ అని, పట్టుకొచ్చి ఎన్‌కౌంటర్ చేశారని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో కూంబింగ్ నిర్వహించి మావోయిస్టులు, అమాయక ప్రజలను ఎన్‌కౌంటర్ల పేరిట కాల్చి చంపుతోందని ఆరోపించారు. చైతన్యవంతమైన కడవెండి గ్రామం నుంచి వెళ్లిన రేణుక సజీవంగా తిరిగి వస్తుందనుకుంటే, నిర్జీవంగా తిరిగి వచ్చిందన్నారు. 50ఏళ్లుగా ప్రజల మౌలిక వసతులను ప్రభుత్వాలు కల్పించనంత వరకు విప్లవోద్యమం కొనసాగుతూ వచ్చిందని, అమరత్వం పొందిన వారంతా గ్రామీణ ప్రాంతాల్లోని వారేనన్నారు. రేణుక తల్లిదండ్రులు సోమయ్య, జయమ్మ మాట్లాడుతూ తమకు పేగుబంధం క్షోభ మిగిల్చిందేగానీ, అక్షరం ఉన్నంత వరకు తమ బిడ్డ ఈ భూమి మీద బతికే ఉంటుందని కన్నీటిపర్యంతమయ్యారు. రేణుక కథలు, కథనాలను రాసి ఆదివాసీ ప్రజలను చైతన్యపర్చిందని, ఆదివాసీల కష్టాలను కథలు, వ్యాసాల రూపంలో రాస్తూ పత్రికలకు విడుదల చేసిందన్నారు. తుపాకీ పట్టని తమ బిడ్డను ప్రభుత్వాలు అన్యాయంగా పొట్టన బెట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల సత్తయ్య, అస్నాల శ్రీనివాస్, జీవీకె ప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం

గొత్తికోయలతో పీఆర్ ఈఈ సురేష్


ఆదివాసీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పీఆర్ ఈవో సురేష్

ఏటూరునాగారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గొత్తికోయల తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సురేష్ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పరిధిలోని పలు గొత్తికోయ గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు గొత్తికోయ గ్రామాలైన గంటలకుంట, గుండెంగవాయి గ్రామాలను సందర్శించామని తెలిపారు. హనుమకొండ పర్యవేక్షక ఇంజనీర్ కె. మల్లేశం, ఏటూరునాగారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. వెంకటసతీష్, సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్లుతో కలిసి ఆయా గ్రామాల్లోని తాగునీటి వసరులను పరిశీలించి అక్కడి ప్రజలతో ముఖాముఖి అయ్యారు. గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య ఆయన దృష్టికి రాగా, దానిని త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు.

వరి కోతలు షురూ..


వరి పంటను కోస్తున్న యంత్రం

కాటారం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా పలువురు రైతులు తమ వరి పొలాలను హార్వెస్టర్లతో జోరుగా కోతలు కోయిస్తున్నారు. రేగులగూడెం, దేవరాంపల్లి, భూడిదపల్లి, శంకరంపల్లి, ధన్వాడ, గోపాలపూర్, చల్లపల్లి తదితర గ్రామాల్లో వరి వందలాది ఎకరాల్లో కోతలకు సిద్ధంగా ఉంది. బోర్ల కింద సాగు చేసిన యాసంగి వరి పొలాలు మొదటగా కోతకు వచ్చాయి. రైతులు స్వల్ప, మధ్యకాలిక రకాలైన ఎంటీయూ1010, బతుకమ్మ (జేజీఎల్18047), కూనారం118, తరంగిణి (1156), జేజీఎల్ 24423 వంటి వరి వంగడాలను సాగు చేశారు. కోతకు రావడంతో హార్వెస్టర్లతో కోతలు మొదలుపెట్టినట్లు రైతులు తెలిపారు. మరోవైపు అకాల వర్షాలు కురిస్తే నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పంటలను త్వరగా కోయించి విక్రయించాలని చూస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు


(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7400	5300
మక్కలు	2189	1521
కందులు	6452	3022
పెసళ్లు	7501	3022
పల్లికాయ (సూక)	6550	5200
పల్లికాయ (పచ్చిది)	4250	4575
పసుపు (కాడి)	12275	10534
పసుపు (గోల)	12359	9700
తేజ మిర్చి	13050	9500
వండర్ హాట్	13500	10000
యూఎస్ 341	11600	9000
దీపిక	12200	10000
దేశీ	28000	18000
సింగిల్‌పట్టి	21000	18500
తాలు మిర్చి	5000	2500

\- వరంగల్ వ్యవసాయం

ఎండల వేళ.. కాసింత ఉపశమనమిలా..


వరంగల్ చౌరస్తాలో చిన్నారులకు రక్షణగా వస్త్రాలు కప్పి తీసుకెళుతున్న మహిళలు


హనుమకొండ జూపార్కులో చలువ పందిరి నీడలో సేద దీరుతున్న పులి


హనుమకొండ నిట్ సమీపంలో గొడుగు నీడన వెళుతున్న యువతులు

మధ్యాహ్న సమయంలో జనసంచారం లేని భూపాలపల్లి ప్రధాన రహదారి

వరంగల్ కార్పొరేషన్ ఆవరణలోని చెట్లనీడలో సేదదీరుతున్న దృశ్యం

సూరీడు సుర్రుమంటున్నాడు.. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. మాడుపగిలే ఎండలకు బయట అడుగు పెట్టాలంటేనే జనం జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చినా.. గొడుగులు, టోపీలు, వస్త్రాలు ధరించా ల్సిన పరిస్థితి. ఇక ఉపశమనం కోసం కొందరు ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతుంటే.. మరికొందరు శీతలపానీయాలు, కొబ్బరిబొండాలు, తాటిముంజలను తీసుకుంటూ కాసింత ఉపశమనం పొందుతున్నారు. ఇదిలా ఉంటే పశుపక్షాదులు కూడా వేసవి తాపానికి అల్లాడిపోతున్నాయి. మేతకు వెళుతున్న పశువులు చెట్ల నీడన, చెరువుల నీటిలో సేద దీరుతున్నాయి. మరోవైపు హనుమకొండలోని కాకతీయ జువాలజికల్ పార్కులోని జంతువులకు అక్కడి అధికారులు, సిబ్బంది రక్షణ ఏర్పాట్లు చేశారు. పులుల కోసం చలువ పందిళ్లు వేశారు. కొన్నిటిపై నీటిని చల్లి ఉపశమన చర్యలు చేపట్టారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, హనుమకొండ/ వరంగల్/ జయశంకర్ భూపాలపల్లి


హనుమకొండ గోపాల్‌పూర్ వద్ద కెనాల్ నీటిలో ఈత కొడుతున్న విద్యార్థులు


భూపాలపల్లిలో తలపై అట్ట పెట్టుకుని వెళ్తున్న వృద్ధుడు


నిప్పు కోళ్లను నీటితో చల్ల బరుస్తున్న జూ సిబ్బంది


వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో గొడుగుల నీడన చిరువ్యాపారాలు

పత్తి కొనుగోళ్లలో సీసీఐ రికార్డు

2024-25లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36,47,618 క్వింటాళ్లు కొనుగోలు

- రాష్ట్రంలో అత్యధికంగా ఇక్కడి నుంచే పత్తి అమ్మకాలు
- 2024 కంటే 14.36 లక్షల క్వింటాళ్ల అదనంగా కొన్న కాటన్ కార్పొరేషన్
- మద్దతు ధరలు అంతంతే ఉన్నా.. భారీగానే విక్రయించిన రైతులు
- దొంగ టీఆర్‌లతో ప్రైవేట్ వ్యాపారులు విక్రయించిన పత్తి లెక్కలు తేలని వైనం
- 'విజిలెన్స్' నివేదికతోనే వాస్తవాలు వెలుగులోకి!



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రికార్డు స్థాయిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లు చేసింది. పత్తి పంటకు మద్దతు ధర అంతంతే ఉన్నా రైతులు ప్రైవేట్ వ్యాపారులకంటే సీసీఐకే అధికంగా పత్తి విక్రయాలు చేయటం చర్చనీయాంశంగా మారింది. 2024-25 సీజన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 5,13,289 ఎకరాల్లో పత్తి సాగైంది. 41,06,320 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అక్టోబరు నెల చివరి వారంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోలు కోసం సీసీఐ 58కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. అయితే తేమ పేరుతో సీసీఐ భారీగా కోత పెట్టి రైతుల నుంచి కొనుగోలు చేసింది. కనిష్ఠంగా రూ.6వేల నుంచి గరిష్ఠంగా రూ.7,200 వరకు ధరలు పలికాయి. అయినప్పటికి రైతులు ఈ ఏడాది ప్రైవేట్ వ్యాపారుల కంటే సీసీఐ కేంద్రాల వద్దే పత్తి అధికంగా విక్రయాలు చేశారు.

సీసీఐకి 36.47 లక్షల క్వింటాళ్ల పత్తి..

పత్తి కొనుగోళ్లలో ఈసారి వరంగల్‌లో సీసీఐ రికార్డు సృష్టించిందని సమాచారం. గతేడాది 2023-24లో 22,11,873.78క్వింటాళ్ల పత్తిని సీసీఐ రైతుల నుంచి కొనుగోలు చేసింది. 2024-25 సీజన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 36,47,617.85క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సీసీఐ కొనుగోలు చేసింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది అదనంగా 14,35,744.07క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో సుమారు కోటి 5లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తే.. అందులో వరంగల్ నుంచే 36.47లక్షల క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి సీసీఐ సేకరించింది. అత్యధికంగా వరంగల్ జిల్లా వరంగల్ 15,40,686.60క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. వరంగల్ జిల్లాలో 1,20,037 ఎకరాల్లో పత్తి సాగు కాగా, 9,60,300 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే ఇక్కడ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ఉండటంతో అన్ని జిల్లాల నుంచి ఇక్కడ సీసీఐ కేంద్రంలో విక్రయాలు చేశారు. కాగా, గతేడాది వరంగల్ జిల్లాలో 7,83,653.35క్వింటాళ్లే కొనుగోలు చేశారు. ఈసారి ఇది రెండింతలు కావటం చర్చనీయాంశంగా మారింది. అలాగే భూపాలపల్లి జిల్లాలో 91,281 ఎకరాల్లో పత్తి సాగు కాగా, 7,30,250 క్వింటాళ్ల పత్తి దిగుమతి అవుతుందని అంచనా వేశారు. అయితే సీసీఐ మాత్రం 4,25,972.15 క్వింటాల్ కొనుగోలు చేసింది. గత ఏడాది 1,19,274.90క్వింటాల్స్‌ను సీసీఐ కొనుగోలు చేయగా, ఈ సారి మూడు రేట్లు పెరిగింది. అయితే భూపాలపల్లి జిల్లాలోని అనేక మండలాల రైతులు పత్తిని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని సీసీఐ కేంద్రాల్లో విక్రయాలు చేశారు. మొత్తంగా గత ఏడాదితో పోల్చితే ఈసారి పత్తి కొనుగోళ్లలో సీసీఐ రికార్డు సృష్టించిందనే చర్చ జరుగుతోంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోళ్లు (క్వింటాళ్లలో)

జిల్లా	2023-24	2024-25
వరంగల్	7,83,653.35	15,40,686.60
హనుమకొండ	1,14,528.60	1,62,544.45
జనగామ	7,67,851.91	8,74,612.40
మహబూబాబాద్	2,50,436.92	4,10,675.80
భూపాలపల్లి	1,19,274.90	4,25,972.15
ములుగు	1,76,128.10	2,33,126.45
మొత్తం	22,11,873.78	36,47,617.85

కొను'గోల్‌మాల్' ఎంత ?

రికార్డు స్థాయిలో ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో పత్తి కొనుగోళ్లు జరిగినప్పటికీ పలు అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే సీసీఐకి రైతులు విక్రయించే పత్తికి కోసం ఇచ్చే తాత్కాలిక రిజిస్ట్రేషన్ల (టీఆర్)ల్లో భారీగా అక్రమాలు జరిగాయి. ఈ విషయంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్, జనగామ మార్కెట్ కమిటీ కార్యదర్శులతో పాటు ఏడుగురు మార్కెట్ కార్యదర్శులపై ఇప్పటికే మార్కెటింగ్ శాఖ సస్పెన్షన్ వేటు వేసింది. ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసుకుని, దొంగ టీఆర్‌లతో సీసీఐకి అధిక ధరకు పత్తిని ప్రైవేట్ వ్యాపారులు విక్రయించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దొంగ టీఆర్‌లతో కోట్లాది రుపాయల ప్రభుత్వ సొమ్మును ప్రైవేటు వ్యాపారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు పక్కదారి పట్టించారనే ఆరోపణలొచ్చాయి. దీనిపై విజిలెన్స్ విచారణ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో పత్తి కొనుగోళ్లు కూడా గతంతో పోల్చితే 14.36లక్షల క్వింటాళ్లు అధికంగా చేయటం అనుమానాలకు మరింత బలం చేకూర్చేలా ఉందనే చర్చ జరుగుతోంది. వరంగల్ జిల్లాలో అత్యధికంగా ఏనుమాముల మార్కెట్ కొనుగోలు కేంద్రంలోని పత్తి విక్రయాలు జరిగాయి. దీంతో దీంతో సీసీఐకి కొనుగోలు చేసిన పత్తిలో అక్రమార్కులు దొంగ టీఆర్‌లతో ఎంత విక్రయించారు..? ఇందులో ఎవరి పాత్ర ఎంత ఉందనే చర్చ జరుగుతోంది. విజిలెన్స్ విచారణ నివేదిక వస్తే.. వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పడిపోయిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

- రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కావడంతో ప్రభావం
- 257 జీవో, హైడ్రా ఎఫెక్టే అంటున్న అధికారులు



హనుమకొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీ గా తగ్గింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెరువుల పరిరక్షణ కోసం హైడ్రాతో హైదరాబాద్‌లో అక్రమాలను కూల్చివేసిన విషయం తెలిసిందే. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో హైడ్రా ప్రభావం భారీగా పడింది. ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగం క్రయ విక్రయాలు పూర్తిగా తగ్గిపోయి రిజిస్ట్రేషన్ల ఆదాయం పడిపోయిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2023 నుంచి 2024 సంవత్సరానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ. 36 కోట్ల 85 లక్షల 96 వేల ఆదాయం తగ్గింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి తీవ్రంగా గండిపడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగి భూముల ధరల కు రెక్కలు రావడంతో భూముల క్రయ విక్ర యాలు జోరుగా సాగాయి. దీంతో రిజిస్ట్రేషన్ సంఖ్య పెరిగి ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరిగింది.

2024లో తగ్గిన ఆదాయం

2023లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భీమదేవరపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, కొడకండ్ల, మహబూబాబాద్, ములుగు, పరకాల, నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ ఫోర్ట్, వరంగల్ రూరల్, ఆర్‌వో వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల ద్వారా ప్రభుత్వానికి రూ.358 కోట్ల 67 లక్షల 96 వేల ఆదాయం వచ్చింది. 2024లో రూ.321కోట్ల 82లక్షల 44వేల ఆదాయం వచ్చింది. రూ.36కోట్ల 85లక్షల 52వేల ఆదాయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తగ్గినట్లు జిల్లా రిజిస్ట్రర్ అధికారి తెలిపారు.

257 జీవో, హైడ్రా ప్రభావంతో తగ్గుదల

రాష్ట్ర ప్రభుత్వం నాన్ లే అవుట్ల ప్లాట్లకు రిజిస్ట్రేన్లు చేయకపోవడం 257 జీవోతో, హైడ్రా చెరువులు, బఫర్ జోన్ల పరిధిలో భూములపై ప్రభావం పడడంతో రిజిస్ట్రేషన్లు తగ్గినట్లు దీంతో ప్రభుత్వ ఆదాయం పడిపోయిందని అధికారులు తెలిపారు.

గతంలో పెరిగిన భూముల ధరలు

గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడిక పనులు, కాల్వల ద్వారా సాగునీరు అందించడంతో కాస్తులో లేని భూములు వినియోగంలోకి తీసుకురావడంతో ఎకరానికి రూ.4 నుంచి 5 లక్షలు ఉన్న ధరలు ఒక్కసారిగా ఎకరానికి రూ.20లక్షల నుంచి 30లక్షల వరకు రోడ్డు సమీపంలో ఉన్న భూములకు రూ.60లక్షల నుంచి 80 లక్షల వరకు ధరలు ఉన్నాయి. దీంతో 2023 వరకు రిజిస్ట్రేషన్లు పెరిగి ఆదాయం వచ్చింది.

కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. భూముల ధరలు నిలకడగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములు కొనుగోలు చేయాలంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇతర ఉద్యోగులు కొనుగోలు చేయకపోవడం, నాన్ లే అవుట్ ప్లాట్లు 257 జీవో ద్వారా రిజిస్ట్రేషన్లు కాకపోవడం కారణంతో రిజిస్ట్రేషన్లు అరకొరగా సాగుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

ఎల్ఆర్ఎస్‌తో మళ్లీ పుంజుకుంటున్న వైనం

రాష్ట్రప్రభుత్వం నాన్ లేఅవుట్ల ప్లాట్లకు ఇతర భూములకు ఎల్ఆర్ఎస్ ఫీజుతో ప్లాట్ల క్రమబద్ధీ కరణ మార్చి నెలలో ఎల్ఆర్ఎస్ అందుబాటులోకి తీసుకొచ్చింది.మొదటి పదిరోజులు టెక్నికల్ సమస్య లు వచ్చినప్పటికీ మార్చి 31 వరకు గడువు నిర్ణయిం చింది. ప్రజల నుంచి ఆదరణ రావడంతో ఏప్రిల్ నెల చివరి వరకు ఎల్ఆర్ఎస్ గడువు పెంచింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది ప్లాట్ల క్రమబద్ధీకరణకు స్టాంప్‌డ్యూటీ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకుంటున్నారు. దీంతో క్రమంగా ఆదాయం పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గుళిక సూక్ష్మం.. గుణం అద్భుతం

➡ హోమియోపతి వైద్యానికి తరగని ఆదరణ


నేడు ప్రపంచ హోమియోపతి దినోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): 'గుళిక సూక్ష్మం.. గుణం అద్భుతం' అనే నమ్మకం నేటికీ ప్రజలను హోమియోపతివైపు నడిపిస్తోంది. ఓవైపు అల్లోపతి వైద్యం విస్తృతంగా ఉన్నా నేటికీ చాలా మంది హోమియో వైద్యం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏప్రి ల్ 10న హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ సామ్యూల్ హనీమన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ హోమియోపతి ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. హోమియో వైద్య విధానంలో వ్యక్తి శారీరక, మానసిక వ్యాధి లక్షణాలను పరిగణలోకి తీసుకుని అవే లక్షణాలు కలిగిన హోమియో మందులను ఎంచుకుని చికిత్స చేస్తూ వస్తున్నారు. తద్వారా ఆధునిక యుగంలో వచ్చే ఎన్నో రకాల వ్యాధులు హోమియో మందులతో నయం చేస్తున్నారు. ఒక వినూత్న విప్లవాత్మక వైద్య విధానాన్ని డాక్టర్ హనిమన్ ఆవిష్కరించి ప్రజలకు అందించడం హర్షణీయం. ఆధునిక వైద్య పరికరాలకు కూడా అందని ఎన్నో మానసిక రుగ్మతలను హోమియోపతి వైద్య విధానం నయం చేస్తోంది. ప్రస్తుత ప్రపంచమంతా ఆరోగ్యం గురించి పరితపిస్తూ.. వ్యాధుల నుంచి తట్టుకుని మెరుగైన వైద్యం కోసం రూ.వేల నుంచి రూ.లక్షల వరకూ ఖర్చు చేస్తున్నారు. అత్యంత సరళమైన వైద్య విధానం హోమియోపతికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు వ్యాధులను నయం చేయడంలో ఈ వైద్య విధానం ఎంతగానో తోడ్పడుతుంది. మూత్ర పిండాల్లో రాళ్లు, జీర్ణకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, లైంగిక సమస్యలు, గర్భకోశ వ్యాధులు, సైనసైటీస్, థైరాయిడ్ అంటి దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడంలోనూ ఈ వైద్యం ప్రముఖ పాత్ర పోషిస్తోంది హోమియో వైద్యులు చెబుతున్నారు.

లక్షణాలను బహిర్గతం చేసేది హోమియోపతి

తారావర్షిణి, హోమియోపతి వైద్యురాలు



హోమియోపతి అనేది ఆశ్చరకరమైన ఫలితాలనిచ్చే ఒక శక్తివంతమైన వైద్య విధానం. హోమియోపతిలో వ్యాధి నివారణకు సూక్ష్మమైన, సున్నితమైన పరిష్కారాలను అవలంబిస్తారు. సత్వర పరిష్కారాలు లేకపోయినా దీర్ఘకాలిక ఉపశమనం మాత్రం ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో ప్రజాదరణ పొంది, ప్రపంచవ్యాప్తంగా దాని ప్రభావం చూపిస్తోంది. హోమియోపతి అనేది కేవలం ఒక వైద్య విధానం మాత్రమే కాదు. ఒక జీవన విధానం. ఇది ఒక సూత్రం.


మందులోడు.. మాయలోడు!

(3వ పేజీ తరువాయి)

వెయ్యి, 1,500 కి.మీ లోపే తన కార్లను తిప్పి, 2,500కి.మీలు తిప్పినట్లుగా మీటర్ రీడింగ్‌లు మార్చి.. డిజిల్ డబ్బులు కాజేస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అధికారులు తన సొంత వాహనాలను వాడుకుని, ఈ ఉద్యోగికారుకు సంబంధించి బిల్లులను చెల్లించి ఫిఫ్టీ-ఫిఫ్టీగా పంచుకుంటారనే ప్రచారం ఉంది. మెడికల్ ఉద్యోగుల్లో చాలా మంది డ్యూటీలకే వెళ్లటం లేదని, ఇలాంటి సమయంలో వారికి సంబంధించిన కార్లను ప్రైవేటు అద్దెకు పంపించి, వచ్చినా అద్దె డబ్బులు, డీజిల్ డబ్బుల్లో సదరు అధికారికి కూడా వాటా ఇచ్చి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మెడికల్ కాలేజీలకు ఏర్పాటు చేసిన బస్సులు, అలాగే అందులో పని చేసే వైద్య ఉద్యోగులకు ఏర్పాటు చేసిన అద్దె కార్లు కూడా ఈ ఉద్యోగి బినామీవేననే ప్రచారం జరుగుతోంది. ఈ అద్దె కార్లలో ఐఏఎస్‌లతో పాటు పలువురు డీఎంహెచ్‌వోలు, అడిషనల్ డీఎంహెచ్‌వోలు లాంటి కీలక ఉద్యోగులు కూడా ఉండటం.. వారితో పరిచయాలు పెంచుకుని తన పనులు చక్కదిద్దుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. వీటితో పాటు వరంగల్, జనగామ, మహబూబాబాద్ తదితర జిల్లాల్లోని అంబులెన్స్‌లు, డెడ్‌బాడీ ఫ్రీజర్లు కూడా ఈ ఉద్యోగి బినామీవేననే ఆరోపణలున్నాయి. ఇక ఏ జిల్లాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు నోటిఫికేషన్ వచ్చిన ఈ మెడికల్ డాన్ కనుసన్నల్లోనే భర్తీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. నిరుద్యోగుల నుంచి పోస్టును బట్టి రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తారని సమాచారం. ఇటీవల జనగామ మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో ఈ కనీసం అర్హత లేనివారికి కూడా ఈ మెడికల్ ఉద్యోగి పోస్టింగ్‌లు ఇప్పించారనే ప్రచారం ఉంది. మహబూబాబాద్ వైద్యశాఖలో భర్తీ చేయను న్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లోనూ ఇతనే చక్రం తిప్పుతున్నాడట. గతంలో కేఎంసీతో పాటు వివిధ జిల్లా కేంద్రాల్లోని మెడికల్ కాలేజీలు, జిల్లా ఆస్ప త్రుల్లో అనేక ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో ఈ ఉద్యోగి చెప్పినవాళ్లకే పోస్టింగులు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఆయా ఆస్పత్రులు, కాలేజీల హెడ్‌లతో పాటు కొన్ని జిల్లాల్లో కలెక్టర్లను కూడా ఈ మాయగాడు మేనేజ్ చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను అంగట్లో సరుకులా మార్చారన్న ప్రచారం జరుగుతోంది. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, డీఆర్‌డీఏ తదితర శాఖల్లో కూడా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో ఈ మాయలోడే చక్రం తిప్పుతారనే ఆరోపణలున్నాయి.

బినామీలకు ఫుడ్.. శానిటేషన్ కాంట్రాక్టులు

ఈ మందులోడి మాయలు అద్దె వాహనాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లోనే కాకుండా కాంట్రాక్టు పనుల్లోనూ దర్శనమిస్తున్నాయి. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో ఈ ఉద్యోగికి బినామీ పేర్లతో కాంట్రాక్టు దందా చేస్తారని సమాచారం. వరంగల్ ఎంజీఎం, ఖమ్మం జనరల్ ఆస్పత్రితో పాటు దాదాపు చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ ఉద్యోగి బినామీ పేర్లతో కాంట్రాక్టులు తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా శానిటేషన్ పనుల్లో తన బినామీ ఏజెన్సీలతో పనులు నిర్వహిస్తున్నారని సమాచారం. వీటితో పాటు చాలా ఆస్పత్రుల్లో రోగులకు అందించే భోజన కాంట్రాక్టులు కూడా ఈ మాయలోడివేననే చర్చ ఉంది. వీటితో పాటు ఆస్పత్రుల్లో కిందిస్థాయి సిబ్బంది నియామకంతో ఇతర కీలక కాంట్రాక్టులన్ని కూడా సదరు ఉద్యోగి బినామీ పేర్లతో నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా ఒక్కడే కాకుండా మరో ముగ్గురితో కలిసి చిన్నపాటి ముఠాను కూడా ఏర్పాటు చేశారని తెలుస్తోంది. ఔట్‌సోర్సింగ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసిన వ్యక్తితో పాటు జనగామ మెడికల్ కాలేజీలో పని చేసే ఓ ఉన్నతస్థాయి ఉద్యోగితో కలిసి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలతో పాటు ఇతర సర్వీసులు కూడా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఓ వేడుకకు ఏకంగా ఓ ఐఏఎస్‌నే అతిథిగా పిలుచుకుని నాలుగైదు లక్షలు ఖర్చు చేసి విందుతో పాటు ఖరీదైన బహుమతులిచ్చారని, మత్తెక్కించేలా ఏర్పాట్లు చేశారనే ప్రచారం జరుగుతోంది. వైద్యశాఖలో చర్చనీయాంశంగా మారిన సదరు ఉద్యోగిలీలలపై జనగామ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి.. డీజీపీకి ఇటీవల ఫిర్యాదు చేయటంతో తెరపైకి వచ్చాయి. సదరు ఉద్యోగిపై విజిలెన్స్ విచారణ చేపట్టితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వైద్యవర్గాలే అభిప్రాయాలు వ్యక్తం చేయడం గమనార్హం.



రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి రైతుల సంస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మంద సారంగపాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ.అమ్జద్ పాషా మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, రైతుభరోసా అందించాలని, ఫసల్ బీమాను సులభతరం చేయాలని, పంటలకు మద్దతు ధర చెల్లించాలని, అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వెంకటాపూర్ మండలంలోని లింగాపూర్, జవహ ర్‌నగర్ గ్రామాల్లో ప్రభుత్వ ఉమ్మడి సర్వే నిర్వహించి కాస్తు కబ్జాలో ఉన్న రైతుల భూములకు రక్షణ కల్పించాలన్నారు. ములుగు మండ లంలోని కాసిందేవిపేట, పత్తిపల్లి, పొట్లాపూర్, చిన్నగుంటూరుపల్లి, అన్నంపలి తదితర గ్రామాలకు రంగయ్యచెరువు పైపులైన్ ద్వారా సాగునీరు అందించాలని, అటవీ భూములకు విద్యుత్‌లైన్, బోరు సౌక ర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే సమరశీల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మహేందర్‌జీకి అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఇంజం కొమురయ్య, బండి నర్సయ్య, బోడ రమేష్, వెంకటస్వామి, మర్రి స్వామి, సాంబయ్య, కొయ్యడ లక్ష్మి, ఈసం మహేందర్, లక్ష్మీనారాయణ, మనోహర్, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నేతలు

మహాముత్తారం, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. మహాముత్తారం గ్రామానికి చెందిన తాటి రాణి-వెంకటేశ్వర్లు దంపతులు పాపన్న రాతి విగ్రహాన్ని సమకూర్చారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు లింగయ్య, సభ్యులు తాటి బాలయ్య, మారగోని బాపు, ముక్కెర రాజయ్య, బాపుగౌడ్, రాజమల్లు, మార్క రాముగౌడ్, సురేష్, రమేష్, వెంకటేష్, మల్లయ్య, శంకర్, సమ్మయ్య, తిరుపతి, సదువలి, శేఖర్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌తో చదువు మానేసిన వారికి ఏఐటీటీ పరీక్ష

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతితో చదువు మానేసి ఏదైనా సంస్థలో పనిచేస్తున్న వారు ఏఐటీటీ పరీక్ష రాయడానికి అవకాశం ఉందని ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కంపెనీలో వివిధ ట్రేడ్లలో మూడేళ్లుగా పనిచేస్తున్న వారికి ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆ సంస్థ ద్వారా పీఎఫ్ కలిగి ఉండాలని, అనుభవ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఈనెల 12లోగా హనుమకొండలోని ములుగురోడ్ వద్ద ఉన్న ఐటీఐ రీజనల్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష అనంతరం ఏఐటీటీ పూర్తిచేసినట్లు సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

గాలి దుమారం.. అకాల వర్షం



దేవరాంపల్లిలో నేలవాలిన వరి

కాటారం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి గాలిదుమారంతో కూడిన వర్షం కురిసింది. దీంతో పంటలు దెబ్బతింటాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలివానకు మండలంలోని రేగులగూడెం, కాటారం, గారెపల్లి, దేవరాంపల్లి, గోపాల్‌పూర్, శంకరంపల్లి, బూడిదపల్లి తదితర గ్రామాల పరిధిలో వరి నేలవాలింది. చింతకాని, దంతెలపల్లి, అంకుసాపూర్ తదితర గ్రామాల పరిధిలో గాలి దుమారంతో చెట్లు కూలాయి. చెట్టు మీద పడటంతో మహ్మద్ బారి పాషాకు చెందిన పాడిగేదెపై చనిపోయింది. సుమారు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. గాలి దుమారంతో పలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పలు రకాల పంటలు కోత దశలో ఉండగా అకాల వర్షాలు కురుస్తుండటంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేసి సేకరణ చేయాలని కోరుతున్నారు.

పెద్దతూండ్లలో పోషణ పక్షోత్సవాలు

మల్హర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దతూండ్లలో పోషణ పక్షోవాత్సవాలను బుధవారం నిర్వహించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి తల్లిపాల ఆవశ్యకతను గురించి అవగాహన కల్పించారు. మొదటి వెయ్యి రోజుల్లో పోషకాహార ప్రాముఖ్యత గురించి గర్భిణులు, పాలిచ్చే తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, సౌజన్య, రమా, రజిత, భారతి తదితరులు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' కెనాల్ విస్తరణకు సర్వే



సర్వేలో అధికారులు, సిబ్బంది, పోలీసులు

కాటారం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా జాదరావుపేట పరిధిలో మెయిన్ కెనాల్ నిర్మాణం, గూడూరు చెరువు కట్ట విస్తరణ కోసం భూసేకరణకు అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. ఆదివారంపేట డెలివరీ సిస్టర్న్‌లో భాగంగా మెయిన్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న సర్వేలో చాలామంది రైతులు పాల్గొనకపోవడంతో సర్వే పాక్షికంగా జరిగింది. కెనాల్స్ నిర్మాణం కోసం సుమారు 150 ఎకరాలు భూసేకరణ జరగనుందని అధికారులు తెలిపారు. సర్వే కార్యక్రమానికి ఎస్సై-2 శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ డీఐలు గంగాధర్, రాములు, సర్వేయర్లు వినయ్, తిరుపతి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు జాదరావుపేటలో గ్రామసభ

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మెయిన్ కెనాల్స్ డిస్ట్రిబ్యూటరీల కోసం భూసేకరణపై గురువారం జాదరావుపేట జీపీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రెవెన్యూ గ్రామాల పరిధిలో 45ఎకరాల 39గుంటల భూసేకరణకు సంబంధించి గ్రామసభలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ విభాగం) మయాంక్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగే గ్రామసభలకు భూములు కోల్పోతున్న రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలపాలన్నారు. వీరాపూర్, జాదరావుపేట, రఘుపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో భూసేకరణ కోసం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఏజెన్సీ వైద్యశాలలకు మహర్దశ

- ఏటూరునాగారం ఆస్పత్రి అప్‌గ్రేడ్
- 50 పడకల ఏరియా హాస్పిటల్‌గా మార్పు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సివిల్ పనులకు రూ. 22 కోట్లు మంజూరు

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ వైద్యశాల రూపురేఖలు మారనున్నాయి. ఆరు మండలాలకు పెద్దదిక్కుగా ఉన్న ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. 30 పడకల నుంచి 50 పడకలుగా అప్‌గ్రేట్ చేస్తూ ఏరియా ఆస్పత్రిగా మారుస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆరు మండలాలకు అందుబాటు

ఏటూరునాగారం సామాజిక వైద్యశాల 50 పడకల ఏరియా ఆస్పత్రిగా రూపుదిద్దుకుంటుండటంతో ఏజెన్సీ ప్రాంతంలో మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఏటూరునాగారంతోపాటు వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి మండలాల ప్రజలకు సర్కారు వైద్యం చేరువకానుంది.

మంత్రి సీతక్క చొరవతో...

సామాజిక ఆస్పత్రిని ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంలో పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రత్యేక చొరవ చూపారు. మెరుగైన వైద్యసేవలు అందక గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ క్రమంలోనే ఏరియా ఆస్పత్రిగా మార్పుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతోపాటు ఆస్పత్రి నిర్మాణం తదితర సివిల్ పనులకు రూ. 22 కోట్ల నిధులను వైద్య, విధాన పరిషత్తు మంజూరు చేసింది. సామాజిక ఆస్పత్రిని 50 పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కానుండటంతో ఏజెన్సీ మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహనీయుల ఆశయాలు సాధించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పాదయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం అహర్నిశలు పనిచేసి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన మహనీయుల ఆశయాలను సాధించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఇందుకు కాంగ్రెస్ కృషి చేస్తోందని తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ, రాంనగర్‌లో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ పరిరక్షణ కోసం బుధవారం చేపట్టిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. మనదేశ రాజ్యాంగం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిందన్నారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల ఆకాంక్షలు నెరవేరడం లేదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీకి పేదలంటే లెక్కలేదని, బడా పెట్టుబడి దారులకు ఆయన కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. దేశంలో గాంధీ, అంబేద్కర్ సిద్ధాంతాలను అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, బుర్ర కొమరయ్య, దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, శిరుప అనిల్, రంజిత్, శ్రీనివాస్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు బార్ అధ్యక్షుడిగా వేణుగోపాలచారి



ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చక్రవర్తుల వేణుగోపాలచారి, ప్రధాన కార్యదర్శిగా రంగోజు భిక్షపతి, ఉపాధ్య క్షుడిగా మేకల మహేందర్, కోశాధికారిగా బానోత్ స్వామి దాస్, సంయుక్త కార్యదర్శిగా ఓరుగంటి రాజేందర్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా రాచర్ల రాజ్‌కుమార్, ఈసీ మెంబర్లుగా మేకల అశోక్, రంగోజు సూర్యం ఎన్నిక య్యారు. ఎన్నికల అధికారులుగా దామల్ల సుధాకర్, మంద విజయ్‌కుమార్ వ్యవహరించారు.

భూమిపుత్ర సంఘం ఆధ్వర్యంలో రాంజీ గోండు వర్ధంతి

వెంకటాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో బుధవారం తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో రాంజీ గోండు 165వ వర్ధంతిని నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రాంచందర్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనం తరం రాం చందర్ మాట్లాడుతూ ఆదివాసీల అభ్యు న్నతికి ఉద్య మించిన ఆదివాసీ తొలి పోరాటతరం నాయకుడు రాంజీ గోండు అని అన్నారు. నేటి యువత రాంజీ గోండును స్ఫూర్తిగా తీసుకుని పాలక ప్రభుత్వాలపై పోరా డాలన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాటి లక్ష్మణ్‌రావు, కోరం ప్రసాద్, పూనెం పవన్ కుమార్, కంతి విజయ్, పోడెం రాజేష్, రామచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: బీజేపీ

వెంకటాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులు, వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన జిల్లా రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాల కారణంగా వరి, మిర్చి, మొక్కజొన్న, అరటి, మామిడి, బొప్పాయి, తదితర పంటలు వేసిన రైతులు అప్పులపాలు అయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. పంటలు నష్ట పోయిన రైతుల వివరాలను పక్కాగా నమోదు చేసి వారికి పరిహారం అందించాలన్నారు.

బైక్ అదుపుతప్పి కారోబార్ మృతి



కుమార్ (ఫైల్)

చిట్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో గ్రామ పంచా యతీ కారోబార్ మృతి చెందిన సంఘటన మం డల కేంద్రం శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నవాబుపేటకు చెందిన జిల్లెల కుమార్ (44) కైలాపూర్ గ్రామం పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు మంగళవారం పని నిమిత్తం చిట్యాలకు వచ్చి రాత్రి ఇంటికి తిరుగుప్రయాణమయ్యాడు. ఈక్రమంలో మండల కేంద్రం శివారులో మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న తాటిచెట్టును ఢీకొంది. దీంతో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న గీతా కార్మికుడు గమ నించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలా నికి ఎస్సై శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. మృతుడి బార్య కృప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కారోబార్ కుటుంబాన్ని రాష్ట్ర నాయకులు సాయం

మల్హర్ (ఆంధ్రజ్యోతి) : చిట్యాల మండలం కైలాపూర్ జీపీ కారోబార్ జిల్లెల కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం నేతలు పరామర్శించారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, సభ్యులు రాజేందర్, బాషా, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : డీపీఎం

వెంకటాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం గోవింద్‌చౌహాన్ అన్నారు. బుధవారం మండలంలోని మల్లయ్యపల్లి, లక్ష్మీదేవిపేట, నల్లగుంట, వెంకటాపూర్, రామాంజాపూర్‌లలో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా గోవింద్‌చౌహాన్ మాట్లాడుతూ రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయిం చకుం డా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి ఏగ్రేడ్ రకానికి రూ.2320, కామన్‌గ్రేడ్ రకానికి 2300ల మద్దతు ధర పొందాలన్నారు. ఈకార్యక్రమాల్లో సీసీలు, ఏతఈవోలు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, సీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికా రులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ప్రశ్నప త్రాలను కేంద్రాలకు తరలించే సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇతరులెవరూ పరీక్ష కేంద్రాల్లో ఉండరాదని, గుర్తింపు పొందిన వారిని తప్ప ఎవరినీ కేంద్రాలకు అనుమతించొద్దన్నారు. ఇంటర్ పరీక్షలకు జిల్లాలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశామని, 712 మంది పరీక్షలు రాయనున్నారని అన్నారు. పదోత రగతి పరీక్షల కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేయగా 521 మంది పరీక్షలు రాయనున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, పంచాయతీరాజ్, విద్యుత్, రెవెన్యూ, పోస్టల్, ఇంటర్మీడియట్ విద్య, ఆర్టీసీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పాలనాధికారుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారులుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన మాజీ గ్రామ రెవెన్యూ అధి కారులు, గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ టీఎస్.దివాకర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈనెల 16లోగా గూగుల్‌ఫామ్‌లో దరఖాస్తు చేసుకోవాలని, స్వయంగా సంతకం చేసిన కాపీని కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి అంద జేయాలని పేర్కొన్నారు. ఈ విషయమై గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జరిగే అవగాహన సదస్సుకు హాజరుకావాలని సూచించారు.

కార్యకర్తలు సైనికుల్లా కష్టపడాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలు సైనికుల్లా కష్టపడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకొచ్చిందన్నారు. పల్లెటూరు నుంచి మొదలుకుని పట్నం వరకు ప్రతి ఒక్క పథకంలో కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రతి కార్యకర్తా ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలమంతుల రవింద్రచారి, ఉపాధ్యక్షులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకల కృష్ణాకర్‌రావు, నాయకులు దొంతిరెడ్డి రవిరెడ్డి, దండిగ వెంకన్న, బైకాని మహేందర్, ఏరువ పాపిరెడ్డి, లింగంపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ బహిరంగ సభను విజయవంతం చేయాలి : నాయకపోడ్ దెబ్బ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకపోడ్ దెబ్బ నాయకులు

వెంకటాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జరిగే ఆదివాసీ తుడుందెబ్బ బహిరంగసభను విజయవంతం చేయాలని నాయకపోడ్ దెబ్బ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొల్లెం సారయ్య నాయక్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి గాలి సమ్మయ్య కోరారు. మండల కేంద్రంలోని నాయకపోడ్ గూడెంలో బుధవారం జరిగిన సమావేశంలో బహిరంగసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణపై కమిషన్ నియమించి షెడ్యూల్ తెగలలోని 59 కులాలు, ఉపకులాల వారికి విద్య, ఉద్యోగ, సంక్షేమ, ఉపాధి, రాజకీయాల్లో సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నేత నెమలి నర్సయ్య, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాడపాక శ్యామ్, నాయకపోడ్ దెబ్బ సీనియర్ నాయకులు మేకల మల్లయ్య, పోలెం కౌసల్య, గుర్రం రఘు, పోలెం శ్రీను, విజయ్, సాయి, సంపత్, వట్టం జనార్ధన్, నక్క బుచ్చన్న, దొమ్మరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ అందించాలి

డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధిహామీ పథకం, మిర్చితోటలు, వ్యవసాయ పనులు, ఇసుక క్వారీల్లో పనిచేసే కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గోపాల్‌రావు సూచించారు. బుధవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని వైద్యాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు రోజువారీగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని, పనితీరును మెరుగుపరచుకుని లక్ష్యాలను సాధించాలన్నారు. లేనట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీకాంత్, పవన్‌కుమార్, చంద్రకాంత్, రణధీర్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పూర్ణ, సంపత్‌రావు, ఎస్‌వో స్వరూపరాణి, మానిటరింగ్ సూపర్‌వైజర్ సురేష్‌బాబు, డీడీఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం



శ్రీరామ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఫారెస్టు అధికారులు

గోవిందరావుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1లో ర్యాంకు సాధించిన లింగాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దుర్గం శ్రీరామ్‌కుమార్‌ను మండల కేంద్రంలో జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు యూనిట్ సభ్యులు బుధవారం సన్మానించారు. తాడ్వాయి ఎఫ్‌డీవో, టీజీఎఫ్‌ఏ ములుగు జిల్లా అధ్యక్షుడు చిర్ర శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు టి.దీప్‌లాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కోటేశ్వర్, సభ్యులు జ్ఞానేశ్వర్, ఆదినారాయణ, సందీప్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం : డీఈవో

వెంకటాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ అనేది సహజమని విద్యాశాఖ జిల్లా అధికారి (డీఈవో) పాణిని అన్నారు. ప్రతి ఉద్యోగికీ ఇది తప్పదన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న అటెండర్ సరోజన రిటైర్మెంట్ కార్యక్రమం బుధవారం జరగ్గా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 36 ఏళ్లపాటు ఉద్యోగం చేసిన సరోజన నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. ప్రధానోపాధ్యాయురాలు రాధిక, ఉపాధ్యాయులతో కలిసి సరోజనను సన్మానించారు. ఆదర్శ పాఠశాల చైర్మన్ ఫరీనా బేగం, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యా యులు బాబూరావు, ఫిరోజ్, కిరణ్, మహేష్, వేణు, కిషోర్, జగన్మోహన్, రాజయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.